బాబూరావు రూమ్‌కి చేరేడు.

"ఇందాక సుల్తాన్ బజార్లో మనూరు కలెక్టరుగారి పియ్యేగారు కనిపించేరండి... నమస్కారం సార్, అనగానే - ఏంటి ఇలాగొచ్చేరని భోగట్టా చేసేరండి... సరే, ఇవాళ కాకపోతే రేపయినా ఆయనకి తెలిసేదే గద - అని, మా అబ్బాయి ట్రాన్స్‌ఫర్ సంగతీ, మనం పరిటయ్యగార్ని కల్సుకున్న సంగతీ వారికి మనవి చేసేనండి." అన్నాడు.

ఆ తరవాత వారం రోజులకి -

శివాజీని విశాఖపట్నం టవునేరియాలో ఒక పోస్ట్‌లో నియమించినట్టూ, ఆ పోస్టులో పనిచేస్తున్న రంగారావుని నా ప్లేస్‌లో వేసినట్టూ, నన్ను పాడేరు ఏజెన్సీకి బదిలీ చేసినట్టూ ఆర్డర్స్ వచ్చేయి.

ఆ ఆర్డర్స్ కాగితం చూసేసరికి నాకు ఒళ్ళంతా చెమట్లు కమ్మేసేయి. వెంటనే పి.ఏ. గారి రూమ్‌కి పరుగెత్తేను. చేతిలో సాకుగా ఒక అర్జంటు ఫైలు పుచ్చుకుని.

నేనెళ్ళేటప్పటికి అక్కడ హుజూరు శిరస్తాదారుగారు కూడా వున్నారు.

"సారీ, మిష్టర్ గోపాలమ్!" అని పి.ఏ. గారు డైరక్టుగా ప్రారంభించేసేరు.

"ఏమిటి, నీ ట్రాన్స్‌ఫర్ గొడవేనా?" అని శిరస్తాదార్ గారు పలకరించేరు.

"ఆ శివాజీ దేశ్‌ముఖ్‌కి అర్జంటుగా టౌన్‌లో ఓ ప్లేస్ చూపించవలిసొచ్చింది.... ఎవరికో ఒకరికి షిఫ్ట్ తప్పదు కదా!" అనీసేరు.

"అదికాదు సార్ ; నేను మనవి చేసేదేంటంటే - అసలు ఎమ్.పీ. గారు -" అని మొదలెట్టేను గాని శిరస్తాదార్‌గారు సాగనివ్వలేదు.

"అదే, నే చెప్తుంట. ఎమ్.పీ గారు సరిగ్గా నిన్నే ట్రాంస్ఫర్ చెయ్యమని చెప్పలేదనుకో, ఐనా నువ్విక్కడ జాయినై మూడేళ్లు దాటింది కదా! ఎల్లకాలం ఒకేచోట ఉండి పోవాలని ఎవ్వరూ కోరుకో కూడదు కదా! అందులోనూ ఇదంతా - ఎమ్.పీ. గారి నోటీస్‌లోకి వెళ్ళింది కనుక-"

ఎం.పీ. గారి నోటీసులోకి వెళ్ళడం వరకూ రైటే మరి. అంచేత నేను ఏంచెప్పినా ఎవరూ నమ్మరు.

★

# 69. వివాద భోజనంబు

సన్యాసిరాజని; నాకు పాతికేళ్లనాడు పరిచయం అయిన వాళ్లలో ఒకడు. ఆ రోజుల్లో నేను ఆంధ్రా యూనివర్సిటీ వారి తెలుగు ఎం.ఏ. పరీక్ష (ఫైనలియర్) కి తయారవుతూ ఉండేవాణ్ణి. సాహిత్య చరిత్ర, సాహిత్య విమర్శ, సంస్కృత కావ్య-వ్యాకరణాల పరిచయం లాంటి సబ్జక్టులు నా అంతట నేనే చదువుకున్నా బోధపడేవి గాని లింగ్విస్టిక్స్ అనే భాషాశాస్త్రం విషయంలో అలా కుదరలేదు. అందుకని హాస్టల్లో ఉండి చదివే కుర్రాళ్లలో సత్యనారాయణ రెడ్డి అనే అతన్ని మంచి చేసుకుని ప్రతి వారం మూడేసి రోజులు సాయంకాలం వేళలప్పుడు అతను నాకు తన నోట్సు ఆధారంగా శిక్షణ ఇచ్చే ఒప్పందం పెట్టుకున్నాను. అతనితో బాటు వినయ విహార రూం నెంబరు 36లో ఉండేవాడు ఈ సన్యాసిరాజు.

సన్యాసిరాజు ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఫైనలియర్ స్టూడెంటు. పిఠాపురం దగ్గిర ఒక పల్లెటూరు

అతనిది. మంచి భోజన ప్రియుడు. రెడ్డి దగ్గిర లింగ్విస్టిక్స్ పాఠాలు నేర్చుకోడం కంటె సన్యాసిరాజు భోజనం జోకులు విని రావడం నాకు బావుండేది.

"లేవండి లేవండి; స్కూటర్లున్న వాళ్లందరూ బళ్లు తియ్యండి. అర్జంటుగా టవున్లోకి వెళ్లాలి!" అనేవాడు ఎక్కణ్ణించో సుడిగాలిలా వచ్చి. "ఏమిటి సంగతీ-" అంటే "ఇవాళ మన మెస్సులో వండిన అన్నం చేతులతోనో చెమ్చాలతోనో తినే యోగ్యతలో లేదు. హోల్‌సేల్ స్టీల్‌షాపులకి వెళ్లి దొప్పల్లాటివి కొని తెచ్చుకుంటే వాట్లో పోయించుకుని తాగెయ్యొచ్చు!"- అన్నం జావ అయి పోయిందని చెప్పడం, సొగసు, అది.

"లేబరేటరీకి వెళ్లి సిలిండరు తేవాలి; ఎవరైనా తోడు రండి!"

"ఎందుకు?"

"మన వంటవాళ్లు ఈరోజు చేసిన సాంబారు లోంచి హైడ్రోజన్ సల్ఫైడు భారీ ఎత్తున ఉత్పత్తి అవుతోంది. "సిలిండర్‌లో స్టాక్ చేసి పెట్టుకుంటే ఉత్తరోత్రా పరిశోధనలకి పని కొస్తుంది"- సాంబార్ లో కుళ్లిన ఉల్లిపాయలు వేసేసి తిరగమోత మాడ్చేసిన నాడు వ్యాఖ్యానం అది.

"గోపాలం గారూ; 'కుక్కను చంపిన పాపమెన్నడూ గుడి కట్టించిన పోదన్నా'-అట్టి తత్వం ఎవర్రాసేరండీ?" అన్నాడొకనాడు.

"ఏం, మీరుగానీ ఆ అవస్తలో పడ్డారేమిటి?" అని అడిగాను.

"పోన్లెండి. చేసిన పాపం చెబితే పోతుందిట. నాచేత చెప్పిస్తున్నందుకు థాంక్స్!- అసలేం జరిగిందంటేనూ, శాకపాకాలేమిటో చూద్దామని ఇంతకు ముందు బేస్ కిచెన్‌కి వెళ్లానా! అక్కడ నేనుండగా కుక్క ఒకటి తోకాడించుకుంటూ చొంగ కార్చుకుంటూ వచ్చిందండోయి. మా సుబ్బయ్యర్ హోటల్ ముందు "కుక్కలున్నవి జాగ్రత్త" అని బోర్డుంటుంది; మీరు చూశారో లేదో. అలాటిది అక్కడ లేదు లెండి. సరే ఆ కుక్క లోపలికెళ్తే మా కుక్కులు దాన్ని ఏంచేసి ఎందులో కలిపేస్తారో అని భయపడి అక్కడ మూకుట్లో వున్న అరటికాయ వేపుడు ముక్కలు గుప్పెడు తీసి కొట్టానండి. పదిరాళ్లు వేస్తే ఏదో ఒకటి తగుల్తుందన్నారు కదా. అన్నీ అంత గట్టిగా ఉన్నాయి; ఎన్ని తగిలాయో, కుక్క మరి భౌ అన్న కూత లేకుండా చచ్చూరుకుంది! పక్కనే అట్లకాడుంది; కత్తిపీటుంది; గజంన్నర పొడుగున్న కర్రతెడ్డుంది; దేంతో కొట్టినా బతికి పోయేది; ఆ అరిటికాయ వేపుడుతో కొట్టేను; పాపాత్ముణ్ణి!"-అరటికాయ వేపుడు గట్టిగా వుందని చెప్పడమే అతని ధ్యేయం గాని, మరేం కాదు.

ఏ సందర్భంలో ఏది వండించుకోవాలో దేనికి ఏది జతో సన్యాసిరాజు మంచి నైపుణ్యంతో వర్ణించేవాడు. "ఇంగువా జీలకర్రా వేసి చేసిన కందిపొడి ఉంటే వంకాయ పులుసుపచ్చడి చేయించుకుని కలుపుకోవాలి"- "చిక్కగా చేయించుకున్న పెసరపప్పు పులుసన్నంలోకి పేరిన నెయ్యి నంచుకోడానికి ఉండాలి". "గుఱుపురం ముద్ద కందిపప్పు అన్నంలో కలుపుకుంటే బారామాసి మామిడికాయతో పెట్టిన ఆవకాయ వూట ఉండాలి"- "నువ్వుల పొడీ అన్నం మాగాయ పచ్చడితో తింటేనే మజా!" - "ఎర్రగా గట్టిగా తోడుకున్న పెరుగూ అన్నంలో గుమ్మడికాయ కోరు వడియాలు లేకపోతే కనీసం వూరుబిండి అయినా ఉండాలి!"- ఇవి సన్యాసిరాజు సిద్ధాంతాలు. "భోజనం దేహిరాజేంద్ర, ఘృత సూప సమన్వితం; మాహిషంచ శరశ్చంద్ర చంద్రికా ధవళం దధి- అని కాళిదాసు శ్లోకం ఉంది. కంది గుండా చమే, గేదె పెరుగూచమే, చేగోడీశ్చమే - అని కన్యాశుల్కంలో చమకం ఉంది" - అంటూ వాఙ్మయస్పర్శచేసేవాడు.

"మన సంప్రదాయాలన్నిట్లో పెళ్ళి భోజనం సంప్రదాయం అంటే నాకు చాలా గౌరవం. పప్పన్నం ఎప్పుడు?-అంటే పెళ్ళెప్పుడు చేసుకుంటావు అని అర్థం. మాకు బూరె ముక్క ఎప్పుడు పెట్టిస్తావమ్మా అంటే సిగ్గులమొగ్గలు కాని ఆడపిల్లలు అరుదు. అప్పుచేసి పప్పుకూడు అంటే పెళ్ళిచెయ్యడంకోసం అప్పుల్లోపడడం అన్నమాట. ఈ నుడికారాలన్నీ వివాహ వ్యవస్థ అంత పాతవీ అంత చక్కనివీనీ. పెళ్ళిలో ధప్పళం అప్పడం ఉంటాయి. ముక్కల పులుసూ వేసిన అప్పడం-సాంబారు కాదు సుమండీ! బూరెలు వడ్డించుకుని వేలితో చిన్న బెజ్జం పెట్టి అందులో నెయ్యి వేసుకుని తినడం ఎంత గొప్ప అనుభవం! పెళ్ళి పందిరి వదిలి వెళ్తున్న ఆహ్వానితులని మినపసున్ని, అరిసె, లడ్డు, అటుకులు పొట్లాలు కట్టి ఇచ్చి మరీ పంపిస్తారు మనవాళ్లు!" అలా ఉపన్యాసం మొదలెట్టి "వివాహ భోజనంబు!" అనే (భోజనం లాంటి) పాటలోకి జారిపోయేవాడు సన్యాసిరాజు ఒకోసారి. "పెళ్ళిలో ఎవరికి ఏందక్కినా ఆహ్వానితులకి దక్కేది కేవలం భోజనమే కదుటండీ!" అనేవాడు.

మొన్న 'మే' నెల పదో తారీకునాడు సన్యాసిరాజు కూతురికి పెళ్లి జరిగింది. నన్ను ఎలా జ్ఞాపకం పెట్టుకున్నాడో, నా అడ్రస్ ఎలా సంపాదించేడోగాని నాకు కార్డు వచ్చింది. ఈ వూళ్లోనే పెళ్లికదా, ఆదివారమే కదా - అని వెళ్లాను. ఉదయం పదీ యాభైకి ముహూర్తం, ఆ తరువాత విందు! ఓహ్! భోజన ప్రియుడు సన్యాసిరాజు స్వయంగా పెట్టిస్తున్న వివాహ భోజనంబు! అహ హ్హా హ్హా హ్హా...అని నేపథ్య సంగీతంతో సహా వెళ్లాను.

కాని అక్కడ నేను ఆశించిన వేవీ వడ్డించలేదు.ముద్ద కందిపప్పు, బూరెలు, పులిహోర, పెరుగు పచ్చడి, ముక్కల పులుసు, అప్పడం, కందాబచ్చలికూర-ఏవీ వడ్డించలేదు.

"వెజిటబుల్ పలావు"; "కచంబర్"; "వైట్ రైస్" (అన్నం అంటే చిన్నతనం కదా!) బంగాళా దుంపల "కుర్మా", వేరుసెనగ పప్పు పచ్చడి, సాంబారు, తాగడానికి తప్ప అన్నంలో కలుపుకోడానికి పనికిరాని "బటర్‌మిల్కు"-

రోజురోజుకీ పాప్యులర్ అయిపోతూ సంప్రదాయంగా రూపుదిద్దుకుంటున్న ఇది "వివాహ భోజనంబు" కాదు; "వివాద భోజనంబు!" అనిపించింది.

★

# 70. వక్రచక్రం

"**మూ**గమనసులు" 1964లో వచ్చింది. మరీ అంత మరిచిపోగల సినిమా కాదు. అందులో ఒకపాట ఉంది. "గోదారీ గట్టుందీ...." అనే ఎత్తుగడతో. అందులో కొన్ని మాటలు -

ఎన్నెల ఉంది, ఎండ ఉంది, (ఇంకోటేదో ఉంది); పువ్వుంది -

ఏది ఎవరికి ఇవ్వాలో ఇడమరిసే ఆ "ఇది" ఉంది!

ఈ మాటలు ఒక పల్లెటూరి పిల్ల పాత్రద్వారా "సినీకాస్ట్" అయ్యాయి.

మా చక్రధరరావు ఎవర్నయినా మెచ్చుకున్నా తిట్టినా నాకు ఈ పల్లెపిల్ల ఎనాలిసిస్ గుర్తొచ్చి అతని మీద కొంచెం చిరాకు వేసి మరుక్షణంలో సరదాకూడా వేస్తుంది.

ఒకసారి చక్రధరరావూ నేనూ దుర్గాభవన్ అనే పేరుగల ఒక కాఫీ హోటల్‌కి వెళ్లేం. సప్లయర్ మా టేబిల్ దగ్గరికి రాగానే చక్రధరరావు "ఇడ్లీ" అని రెండు వేళ్లు చూపించి నన్నూ తననీ మార్చి మార్చి చూపించి రెండు ప్లేట్లు తెమ్మని కూడా నిర్ద్వంద్వంగా చెప్పేడు.